క్లుప్తంగా

బ్రహ్మజ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వామి

కాకినాడ రూరల్: కాలజ్ఞానాన్ని బోధించిన బ్రహ్మజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని ఆధ్యాత్మికవేత్త డాక్టర్ శిరీష అన్నారు. మహాయోగి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతిని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. బ్రహ్మంగారి చిత్రపటానికి డాక్టరు శిరీష, అడబాల రత్నప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ బ్రహ్మంగారి కాలజ్ఞానం ఇప్పటికీ జరుగుతూనే ఉందన్నారు.

మరిడమ్మ తల్లి ఆలయం ప్రారంభం



మరిడమ్మ ఆలయ ప్రారంభోత్సవ పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, మహాలక్ష్మి దంపతులు

కాకినాడ: స్థానిక జగన్నాథపురం 18వ డివిజన్ పరిధి మరిడమ్మపేట బొడ్డువారి వీధిలో కొత్తగా నిర్మించిన మరిడమ్మ తల్లి ఆలయాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మి దంపతులు శనివారం ప్రారంభించారు. దాతల సహకారంతో ప్రజలు ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రారంభానికి విచ్చేసిన ద్వారంపూడి దంపతులకు స్థానిక పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు తోడ్పాటు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్లు ఎంజీకే కిశోర్, చవ్వాకుల రాంబాబు, బొర్ర రమణ, వైఎస్సార్ సీపీ నాయకుడు ధోని చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

మత్స్యావతారంలో సీతారామస్వామి



మత్స్యావతారంలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామి వారు శనివారం రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి అభిషేకాలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో పార్వతీ సమేత త్ర్యంబకేశ్వరస్వామి ఆలయంలో శనివారం నందీశ్వరుడి అభిషేకాలు జరిగాయి. కార్తిక మాసం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆకుల రాజబాబు దంపతులు అభిషేకాలు చేశారు.

విద్యార్థుల రక్తదానం

బాలాజీచెరువు: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ ఎస్.పూర్ణచంద్రరావు అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రగతి డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి ఇటువంటి శిబిరాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని 84 యూనిట్ల రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను ప్రగతి విద్యా సంస్థల డైరెక్టర్ హిమబిందు, ప్రిన్సిపాల్ షానాజ్, బ్లడ్ బ్యాంక్ ఏఓ అప్పలరాజు అభినందించారు.

ఇష్టంగా చదవాలి

బోట్‌క్లబ్: పదో తరగతి విద్యార్థులు ప్రతి సబ్జెక్టును ఇష్టంగా చదివితే పరీక్షల్లో ఉత్తమ మార్కులు పొందవచ్చని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో శనివారం జిల్లాలోని 14 భాష్యం బ్రాంచ్‌లకు చెందిన 1,600 మంది విద్యార్థులకు భవిష్యత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రణాళికగా చదువుకోవాలన్నారు. భాష్యం విద్యాసంస్థల సలహాదారు మైకల్‌రాజు, జోనల్ ఇన్‌చార్జి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీపీఠం.. ఆధ్యాత్మిక సౌరభం

- భక్తిశ్రద్ధలతో మహాశక్తి యాగం
- జొన్నవిత్తుల ప్రవచనాలు, తపోవనం స్వామి అనుగ్రహభాషణ



కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

కాకినాడ రూరల్: లలితా సహస్ర నామార్చనలతో మహిళలు శత కోటి కుంకుమార్చనల వైపు సాగుతుంటే.. కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠం కార్తిక మాసంలో ఆధ్యాత్మికతతో తరిస్తోంది. పూజ్యశ్రీ పరిపూర్ణానంద స్వామి దివ్య ఆశీస్సులు, ఆయన పర్యవేక్షణలో దీక్ష చేపట్టినట్టు మహిళలు ఐశ్వర్యాంబిక అమ్మవారి అనుగ్రహంతో కుంకుమార్చనలు చేస్తూ మహాశక్తి యాగాన్ని విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నారు. శనివారంతో మహాశక్తి యాగం 12 రోజులు పూర్తి చేసుకుంది. ఉదయం నక్షత్ర, తిథి పూజల అనంతరం మహాశక్తి యాగాన్ని వేదిక ప్రాంగణంలో నిర్వహించారు. వేలాదిగా పాల్గొన్న మహిళలను ఉద్దేశించి విశిష్ట అతిథులుగా హాజరైన ప్రముఖ ప్రవచనకర్త జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, తుని తపోవనం స్వామీజీ సచ్చిదానంద సరస్వతి ప్రసంగాలు భక్తుల్లో ఆధ్యాత్మికతను నింపాయి. జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పద్యాలతో అలరించారు. ఆయన మాట్లాడుతూ జగన్మాత కుంకుమ బొట్టులో రేణువులుగా ఇక్కడ కూర్చున్న మహిళామణులు కనిపిస్తున్నారన్నారు. భక్తితో పారాయణ చేసే మహిళలకు అమ్మవారి అనుగ్రహం తప్పక కలుగుతుందన్నారు. ఆధ్యాత్మిక గురువు పరిపూర్ణానంద స్వామి ఎంతో శ్రద్ధతో పూజలు చేయిస్తున్నారన్నారు. తపోవనం సచ్చిదానంద సరస్వతి స్వామి అనుగ్రహ భాషణ చేస్తూ గో పూజ, గో సేవ మహిమాన్వితమన్నారు. లలితా సహస్ర నామార్చనలతో కుంకుమార్చనలు చేయడం విశేషమన్నారు. గంగానదీ స్నానం, కాశీలో కోటి లింగాలు ప్రతిష్ఠిస్తే ఎంత ఫలితమో అంత ఫలమన్నారు. శత కోటి లలితా కుంకుమార్చనలు ఆచరించడం ఎంతో విశేమన్నారు. అనంతరం మహిళలతో లలితా నామార్చనలను పరిపూర్ణానంద స్వామి చేయించారు. మహాశక్తి యాగంలో భాగంగా లలితా సహస్ర నామాలతో పాటు 4 లక్షల దేవీ ఖడ్గమాల స్తోత్రాలు పూర్తి చేశామన్నారు. పూజల అనంతరం లలితాదేవి అమ్మవారికి హారతి ఇచ్చారు. సాయంత్రం కోటి దీపోత్సవ వేదిక వద్ద డాక్టరు వేదాంతం రామలింగశాస్త్రి బృందం కూచిపూడి నృత్యంతో అలరించింది. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తుల ఊరేగింపు అనంతరం పరిపూర్ణానంద స్వామి దీపోత్సవ విశిష్టతను తెలియజేశారు. ఆదివారం పౌర్ణమి రోజున ఐశ్వర్య దీపం వెలిగిస్తామన్నారు. అనంతరం భక్తులు దీపోత్సవంలో పాల్గొని తరించారు. రాత్రి బగళాముఖి హోమం నిర్వహించారు.



లలితా అమ్మవారికి హారతి ఇస్తున్న తపోవనం సచ్చిదానంద స్వామీజీ



శ్రీపీఠంలో ప్రవచిస్తున్న ఆధ్యాత్మికవేత్త జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు

సాఫ్ట్ టెన్నిస్‌బాల్ పోటీలు ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా సాఫ్ట్ టెన్నిస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్‌ఏలో అంతర్ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను నగర ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సాఫ్ట్ టెన్నిస్‌బాల్ అభివృద్ధికి అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అంతా క్రీడా స్ఫూర్తితో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఏపీ సాఫ్ట్ టెన్నిస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నవీన్ మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. తొలుత పోటీలను ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్, పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, సాఫ్ట్‌బాల్ సంఘ అధ్యక్షుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా ఏపీ

- అందుకే సీఎం జగన్‌కు జనాదరణ
- దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి
- 'వై ఏపీ నీడ్స్ జగన్'కు హాజరు



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, అబ్బయ్యచౌదరి

కాకినాడ: పేదల సంక్షేమానికి, అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ చిరునామా నిలిచిందని దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అన్నివర్గాల ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్థానిక 43వ డివిజన్ ప్రతాప్‌నగర్ ప్రాంతంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీడీపీ– వైఎస్సార్ సీపీ పాలనలోని వ్యత్యాసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా ఎమ్మెల్యే ద్వారంపూడితో కలసి వివరించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ పేదలకు చేయూత ఇవ్వడమే వైఎస్సార్ సీపీ సిద్ధాంతమని స్పష్టం చేశారు. పేదల పక్షాన నిలబడతానని 2019 ఎన్నికల ముందే సీఎం జగన్ ప్రకటించి, అదే విధానాన్ని ఇప్పుడు అమలు చేస్తున్నారన్నారు. సీఎం జగన్‌ను, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారన్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, రుణమాఫీ వంటి అనేక వాగ్దానాలు ఇచ్చి ఆ తరువాత దగా చేసిన చంద్రబాబు తీరును ప్రజలకు అర్థమయ్యేలా వివరించామన్నారు. భావితరాల భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితా బోర్డును ఎమ్మెల్యేలు అబ్బయ్యచౌదరి, ద్వారంపూడి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ డిప్యూటీ మేయర్లు చోడిపల్లి సత్యప్రసాద్, మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జేడీ పవన్‌కుమార్, నాయకులు కోక వెంకటగిరి, పిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు అండగా ఉంటా..

శెట్టిబలిజ కులస్తులకు అన్నివిధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శెట్టిబలిజ సంఘం–కాకినాడ టౌన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ గౌరవాధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు, అధ్యక్షుడు పిల్లి శంకరరావు మాట్లాడుతూ కాకినాడలో శెట్టిబలిజ కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వపరంగా మరింత తోడ్పాటు అందించాలని కోరారు. సంఘ కార్యదర్శులు దొమ్మేటి చక్రి, పితాని దివాకర్, ఉపాధ్యక్షుడు బత్తిన పైడ్రాజు, మట్రిపూడి రమణ, గర్రె బాబ్జి, పితాని దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది రాకుండా సాగునీరు

- ప్రత్యేక కార్యాచరణతో ముందుకు..
- జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు

కరప: ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి రైతులకు ఇబ్బంది లేకుండా రబీలో సాగు నీరందించాలని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సూచనల మేరకు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు సమావేశమయ్యారు. రబీలో వరి నాట్లు వేసుకునే ప్రక్రియ నుంచి సాగునీటి సరఫరాలో అనుసరించాల్సిన విధానాలపై చర్చించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో గోదావరిలో సాగునీటి లభ్యత తక్కువగా ఉన్నందున రబీలో ఉన్న వనరులను సమీకరించుకుని, సాగునీరు వృథా కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని, దీనికి రైతులు సహకరించాలన్నారు. ఇరిగేషన్ శాఖ కొవ్వూరు సెక్షన్ డీఈఈ ఆకుల రవికుమార్ మాట్లాడుతూ రబీలో పూర్తి ఆయకట్టుకు అనుమతించామన్నారు. డిసెంబరు 1న కాలువలకు నీరొదిలి, మార్చి నెలాఖరుకు కాలువలు మూసివేస్తారన్నారు. రైతుల వినతి మేరకు ఎమ్మెల్యే కన్నబాబు సూచనలతో కాలువల్లో గుర్రపుడెక్క తొలగించేందుకు, మురుగు కాలువల్లో గుర్రపుడెక్క తొలగించి, అడ్డుకట్టలు వేసేందుకు కలెక్టర్ కృతికా శుక్లా నిధులు మంజూరు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. మండలంలో 14 చోట్ల అడ్డుకట్టలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన చోట ఆయిల్ ఇంజిన్లతో మురుగు కాలువల్లోని నీటిని తోడిస్తామన్నారు. జనవరి నుంచి వంతుల వారీ విధానం అనుసరిస్తామని డీఈఈ తెలిపారు. కరప డీసీ మాజీ చైర్మన్ బండే తాతాజీ మాట్లాడుతూ డ్యామ్‌ల వద్ద ఎగువ రైతులు అడ్డుకట్టలు వేయకుండా పర్యవేక్షించాలని, లేకపోతే శివారు ప్రాంతానికి నీరందదన్నారు. రైతులు సోడగం సూరిబాబు, సింగినేని చినబాబు, మార్నె్ల వెంకటరమణ కల్పించుకుని కాలువలకు నీరొదిలే లోగా కాలువల్లో పూడిక తీయించి, గుర్రపుడెక్క తొలగించాలన్నారు. జెడ్పీటీసీ సుబ్బారావు ఎమ్మెల్యే కన్నబాబుకు ఫోన్ చేసి రైతుల వినతిని వివరించారు. వారం పది రోజుల్లో పనులన్నీ చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు మాట్లాడుతూ మార్చి లోపు పంట కాలం పూర్తయ్యే రకాలను సాగు చేసుకోవాలన్నారు. ఎన్‌జీ రంగా వర్సిటీ బోర్డు సభ్యుడు చింతా ఈశ్వరరావు, బొండా చంటిబాబు, పెంకే సత్తిబాబు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీడీఓ కె.అప్పారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాకారుల ఎంపికలు



జిల్లాస్థాయి స్పై మార్షల్ ఆర్ట్స్ ఎంపికలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం అనురాధ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్పై మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారుల ఎంపికలు శనివారం కాకినాడలో ఉత్సాహంగా జరిగాయి. స్థానిక శ్రీనగర్ మున్సిపల్ బాలికల పాఠశాలలో నిర్వహించిన ఈ ఎంపికలను పాఠశాల హెచ్‌ఎం టి.అనురాధ, ఎస్‌జీఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ప్రారంభించారు. అండర్–14, 17 విభాగంలో 58 మంది హాజరు కాగా 28 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. పీఈటీ సంఘ కార్యదర్శి నూకరాజు, స్కూల్ గేమ్స్ సంయుక్త కార్యదర్శి శ్రీహరిరాజు, పీడీ రవికుమార్, హరికృష్ణ, సత్య తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని డిమాండ్

కాకినాడ: విజయవాడ దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబుపై హత్యాయత్నం చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సగర సంఘ అధ్యక్షుడు కటారి త్రిమూర్తులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక గొడారిగుంటలోని సీతారామ ఆలయం వద్ద శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అణచివేతకు గురైన సగర సామాజిక వర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారన్నారు. చైర్మన్ రాంబాబుకు భద్రత కల్పించాలని కోరారు. సంఘ నాయకులు నక్కా మాధవ్, అప్పన్న పాల్గొన్నారు.

నేడు, రేపు బాలాత్రిపుర సుందరిదేవికి ప్రత్యేక అలంకరణ

బోట్‌క్లబ్: కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆది, సోమవారాల్లో స్థానిక బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో అమ్మవారు భక్తులకు బంగారం చీరలో దర్శనమిస్తారని ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం రాత్రి 8.30 ఆలయంలో జ్వాలాతోరణ మహోత్సవం ఉంటుందన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులకు మెటీరియల్

బాలాజీచెరువు: స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో శనివారం గ్రూప్–2 పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు షైన్ ఇండియా సంస్థ మెటీరియల్ పంపిణీ చేసింది. విద్యార్థులకు పరీక్ష నిర్వహించి టాప్ టెన్‌లో నిలిచిన వారికి జిల్లా గ్రంథాలయ కా ర్యదర్శి ప్రసాద్ చేతుల మీదుగా వీటిని అందజేసింది.

ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై దృష్టి

కాకినాడ సిటీ: ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి శనివారం అమరావతి నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి పాల్గొన్న అనంతరం ఆమె అధికారుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అధికారులు ముందుకు సాగాలని కలెక్టర్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించి షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. జిల్లా జెడ్పీ చైర్మన్ ఎ.రమణారెడ్డి, వివిధ శాఖల అధికారులు ఎస్.విజయకుమార్, సూర్యప్రకాశరావు, బి.లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్, ఎంవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు



కరపలో రామాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కురసాల సత్యనారాయణ

కరప: కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నట్లు నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ తెలిపారు. కరప శివారు నక్కావారి ఎస్సీ వీధిలో శనివారం రూ.10 లక్షలతో రామాలయం పునర్నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పలు రామాలయాలకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిధులు మంజూరు చేశారన్నారు. నక్కావారి ఎస్సీ వీధిలో రామాలయం శిథిలావస్థకు చేరడంతో, ఆలయం పునర్నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి షెల్టర్ నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, మద్దూరి భాస్కర్, నక్కా సత్తిబాబు, విశాఖ శారదా పీఠం ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్ చాగంటి సూరిబాబు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన



వలసపాకలలో డ్రోన్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రమణారెడ్డి

కాకినాడ రూరల్: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వలసపాకల, రమణయ్యపేట గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వలసపాకల పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో జెడ్పీ సీఈఓ అబ్బిరెడ్డి రమణారెడ్డి, డీఎల్‌డీఓ నారాయణమూర్తి పాల్గొని కేంద్ర పథకాల గురించి వివరించారు. పలువురు లబ్ధిదారులకు కేంద్ర పథకాలు అందించారు. మధ్యాహ్నం రమణయ్యపేట పంచాయతీ వద్ద జరిగిన కార్యక్రమంలో డీపీఓ భారతీ సౌజన్య, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ కె.స్వప్న పాల్గొన్నారు.

దేదీప్యం.. అఖండ దీపోత్సవం



రేపూరు శివాలయంలో దేదీప్యమానంగా విశ్వేశ్వరస్వామి

కాకినాడ రూరల్: రేపూరు గ్రామంలోని శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా శనివారం రాత్రి అఖండ దీపోత్సవం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి దీపోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

కాకినాడ రూరల్: రమణయ్యపేట కూరగాయల మార్కెట్ వద్ద డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో కాకినాడ గుడారిగుంటకు చెందిన సుంకర వెంకట మల్లిఖార్జున లోకేష్ (23) మృతి చెందాడు. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. వలసపాకల వద్ద ఒక బార్‌కు వెళ్లి స్నేహితులైన లోకేష్, రాజమహేంద్రవరానికి చెందిన కొర్లపు సాయి (శ్యాంకుమార్) శుక్రవారం రాత్రి సర్పవరం జంక్షన్ వైపు వస్తుండగా రమణయ్యపేట కూరగాయల మార్కెట్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు. లోకేష్ తలకు, శ్యాంకుమార్ కాలిపై గాయాలయ్యాయి. వారిని జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ లోకేష్ శనివారం మృతి చెందాడు.

మద్యం విక్రేత అరెస్ట్

కాకినాడ క్రైం: ఇంట్లోనే మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పర్లోవపేటకు చెందిన మహిళ నుంచి సారాతో పాటు 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. ఆమె కుమారుడిని కూఅదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించారు.

బీరు సీసాతో దాడి

ఏటిమొగకు చెందిన ప్రసాద్‌కు స్థానిక యువకులతో విబేధాలున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సదరు యువకులు అతనిపై దాడి చేసినట్లు చెబుతున్నారు. ప్రసాద్‌ను అతని సోదరుడు జీజీహెచ్‌లో చేర్చాడు. ఈ ఘటనపై పోర్టు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

ఎన్నికల విధులపై సమీక్ష

కాకినాడ: ఎన్నికల విధులపై సెక్టార్ అధికారులతో సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు శనివారం సమావేశమయ్యారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఏఈ ఆర్వోలు, నియోజకవర్గంలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు హాజరయ్యారు. ఈఆర్వోలు కోన శ్రీనివాస్, సీతాపతి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

అప్రమత్తతతో చోరీలకు అడ్డుకట్ట

కాకినాడ రూరల్: అప్రమత్తతతోనే చోరీలకు అడ్డుకట్ట వేయవచ్చని, గ్రామాల్లో ముఖ్య కూడళ్లు, ఇళ్ల, ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ తెలిపారు. విలేజ్ విజిట్ కార్యక్రమంలో భాగంగా శనివారం రమణయ్యపేట గ్రామ పరిధిలోని రాయుడుపాలెం టీచర్స్ కాలనీ పార్కు వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై అజయ్‌బాబు, నాయకులు లింగం రవి, వరప్రసాద్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తనిఖీలు

కాకినాడ సిటీ: ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో మొత్తం 15 కేసులకు సంబంధించి జాయింట్ కలెక్టర్ ఇలక్కియ విచారణ చేసి రూ.1.19 లక్షల అపరాధ రుసుం విధించారు. జిల్లా సహాయ ఆహార నియంత్రణ అధికారి బి.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ కేవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

కాకినాడ సిటీ: పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని తదితర డిమాండ్‌లతో కేంద్ర కార్మిక సంఘాలు, రైతాంగ సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. దీనిపై ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే మహాధర్నా విజయవంతం చేయాలన్నారు.